ధర్మంకోసం

[కథానిక]

●

శ్రీ రా. సి. ఆంజనేయశాస్త్రి

సుబ్రహ్మణ్యం జీవితంలో సుఖమనేది ఎరగడు.

ఆ మాటకొస్తే నిజానికతను కష్టాలనుభవించిందీ లేదు, నిరుడు భార్య పోవటంతప్ప. ఇంటర్మీడియేటు ఒకటికి రెండుసార్లు తప్పేసరికి, యిక అలాంటి పనులు చెయ్యడం భావ్యంకాదని తాలూకాఫీసులో గుమాస్తాగా చేరేశాడు. దాంతోటి లంగరుపడింది అతని భావవిహారానికి. బి. ఏ. ప్యాసైనాక ఎం. ఏ. కు వెడదామని కాస్సేపూ, లా చదువుదామని కాస్సేపూ మథనపడి అసలు ఏ ఐ. సి. యస్. కో పోతే, అలాగ్గా జిల్లాకలెక్టరవవచ్చుగదా అని ఆఖరికి ఐ. సి. యస్. కే పోదామని నిర్ణయించుకున్న రోజులుకూడా వున్నాయి సుబ్రహ్మణ్యం, ఇంటర్మీడియేటు చదివేకాలంలో. కవిత్వంకూడా రాసేవాడు అప్పుడప్పుడు. కెమెరా కొన్నాడు ఆ వేసవిశెలవులలో "ఫొటోగ్రఫీ"ని క్షుణ్ణంగా మథించివేద్దామనే ఉద్దేశంతో. ఆటల్లోనూ పాటల్లోనూ ముందుకు తోసుకొచ్చేవాడు. "అతి చురుకు" అని ఆక్షేపించినవాళ్లు కూడా లేకపోలేదు. కాని తాలూకాఫీసులో చేరిన తర్వాత అతని తరహా అంతా మంత్రకట్టుగా మారిపోయింది. సరే, ఆయేడే పెళ్ళికూడా కావటంతో సొంతం పెద్దవాడై వూరుకున్నాడు. తన ఆఫీసేమో యిల్లేమో! అంతేగాని మూడోవిషయంలో [illegible] కల్పించుకొనేవాడు కాడు. దేశసేవచేద్దామని ఒకప్పుడు ఉరుకులెత్తించిన అతని రక్తంలోని వేడికణాలు సొంతం చల్లబడి, ఆఖరికి ఖద్దరుబట్టలకు సైతం స్వస్తి చెప్పేశాడు. [illegible] [illegible] తాను ఎంతమాత్రం పనికిరానవనీ, తాను కేవలం అసమర్థుడిననీ, స్వార్థపరుడిననీ స్నేహితులముందు చాలాసార్లు ఒప్పుకున్నాడుకూడాను. జాతీయోద్యమం మహోద్రేకంతో నడిచిన రోజుల్లోకూడా సుబ్రహ్మణ్యం ఎంతమాత్రం చలించకుండా, తాలూకాఫీసు గుమాస్తాగా తాను నిర్వహించవలసిన పనిని ఎంతో సక్రమంగా నిర్వహించి దేశభక్తుల విమర్శనకూ, రాజభక్తుల పొగడ్తకూ గురయ్యాడు చాలాసార్లు. చెడబరువురి [illegible] ప్రతి రోజూ యింటికి మోసుకొచ్చి, అర్ధరాత్రీ, తెల్లారఝామునాకూడా రాస్తూ పై అధికారుల నోటిమెప్పు పొందటమూ, తీరా వాళ్లు బదిలీఅయి వెళ్ళేసమయంలో యితన్నిగురించి నానా ఆభాసుగానూ రాయడమూ, ఆ కారణంగా ఉద్యోగంలో ప్రమోషను లేకపోవడమూ అతనికి మామూలైపోయింది. ఇంట్లోమటుకు ప్రతి రెండేళ్ళకీ ఒకశిశువు ఉదయించడంవల్ల క్రమం తప్పకుండా కుటుంబాభివృద్ధి మాత్రం జరుగుతూ వచ్చింది. అదేం శాపమోగాని పుట్టిన మొగపిల్లలంతా ఆరోనెలలోపుగానే పోతూవచ్చారు. అందువల్ల ఎనమండుగురు ఆడపిల్లలుమాత్రమే మిగిలారు. మొదటి పిల్లను మేనరికంయిస్తే, తనకాపరం తను చేసుకుంటోంది. కాస్త ముదురయినా, యింత తింటానికుందని రెండోపెళ్ళివాడి కిచ్చాడు రెండోపిల్లని. మూడోపిల్ల పెళ్ళికి అడీయిడీ పోగుచేసి రెండువేలు ఖర్చుచేశాడు. అన్నవస్త్రాలకు లోటులేని సంబంధమే వచ్చింది. అంతవరకూ అతను డబ్బుకి యిబ్బందిపడలేదనే చెప్పాలి - మనిషి స్వభావసిద్ధంగానే పొదుపరవడంచేత.

కాని మాయదారి యుద్ధం వచ్చినతర్వాత అతని పని కిచకిచయిపోయింది. గుంపెడు పిల్లలూ, వచ్చేపోయే బంధువులూ, నాలుగు వేళ్ళూ నోట్లో కెళ్ళడమే కష్టమయిపోయే కాలంలో ఆ పరమాత్ముడి దయవల్ల డిప్యూటీ తాసిల్దారు పని అయింది. ఏదో సంసారం వెళ్ళిపోతోందే తప్పితే, కాలూ చెయ్యీ కూడదీసుకుని పిల్లల పెళ్ళి చేసే అవకాశంమటుకు కనిపించలేదు. "మంచిరోజు లొచ్చినపుడు చూసుకుందాంలే! నాలుగు ముక్కలు చెప్పిస్తే వాళ్ళ మొగుళ్ళని వాళ్ళే తెచ్చుకుంటారు." అనే వేదాంతంలోదిగి పిల్లల పెళ్ళి మాటే తలపెట్టకుండా చదువులు చెప్పించడం మొదలెట్టాడు తెగించి. పెళ్ళీ పేరంటం లేకుండా తనంత ఎత్తు ఎదుగుతున్న కూతుళ్ళను చూస్తే జానకమ్మకు మొదట్లో కాస్త ఎబ్బెట్టుగావుండి "సంబంధాలు చూడండి" అంటూ భర్త సుబ్రహ్మణ్యాన్ని పోరేది కాని, "ఇవి ఒడుగులూ పెళ్ళిళ్ళూ చేసే రోజులా? ప్రతివస్తువూ మండిపోతుంటే!" అని భర్త అనేసరికి ఏమీ చెప్పలేకపోయేది. "ప్రతి వస్తువూ" అనే పదంలో పెళ్ళికొడుకులు కూడా చేరుతారని జానకమ్మకు వెంటనే స్ఫురించేదికాదు. తండ్రి మాటలలోని ధ్వనిని యిట్టే కనిపెట్టిన కూతుళ్లు ముసిముసి నవ్వులు నవ్వుకుంటుంటే ఆఖరికి జానకమ్మకు కూడా అర్థమయి ఫక్కున నవ్వేది. "ఏమో బాబూ! మీ అర్థాలూ మీరూను... నేనేమీ చదువుకున్నదాన్ని కాదయ్యో!" అంటూను. అదీగాక సబ్ జడ్జిగారి అమ్మాయిలకీ, ఇన్స్పెక్టరుగారి అమ్మాయిలకీ బిడ్డల తల్లుల్లాగా పెరిగినా కూడా పెళ్లిళ్లు చేయక పోవడంవల్ల జానకమ్మకు కొంచెం మనోధైర్యంగా వుండేది. పెళ్లిళ్ల ప్రసంగం వచ్చినప్పుడు "చదువు పూర్తి కానియ్యండి నాన్నగారూ! అప్పుడే తొందరేమిటి? వాళ్ల సుశీల నాకంటే రెండేళ్లు పెద్ద. ఇంతవరకూ అసలా మాటే లేదు" అనేవరకూ వచ్చారు కూతుళ్లు క్రమంగా.

"ఏమో బాబూ! సావిత్రియీడుకి నేను ముగ్గురు బిడ్డల తల్లిని. సరస్వతియీడునే రెండో అమ్మాయికి రెండో పిల్లాడు పుట్టి పోయాడు. శారదయీడుకి మూడో అమ్మాయి బిడ్డతల్లి అయిఉండేది. శేషాలు ఈడుకి పెద్దమ్మాయి కాపరానికెళ్లి ఏడాదైంది." అంటూ జానకమ్మ తన ప్రయోజకత్వాన్నీ, కాపరాలుచేస్తున్న తన కూతుళ్ల ప్రయోజకత్వాన్నీ ప్రదర్శించడం ద్వారా పెళ్లి కాని కూతుళ్ల దురదృష్టతని స్ఫురింపజేస్తూ తరుచూ అవ్యక్తంగా వాళ్ల హృదయాలికి గిలిగింతలు పెట్టేది. ఇప్పుడు జానకమ్మకూడా పోవటంతో పిల్లలే అన్నింటికీ పెద్దలై వ్యవహరించాలి సొచ్చేసరికి పాపం సుబ్రహ్మణ్యానికి మహాకష్టంగా వుండేది. ఈ ఏడు కనీసం సావిత్రి నన్నా ఒక అయ్యచేతిలో పెట్టి నమస్కారం చెయ్యడం అవసరమని నిశ్చయించుకున్నాడు.

౨

అనంతకోటి నక్షత్రాల్ని ఆకాశంలోనూ, అంతులేని చిక్కని చీకట్లను తుమ్మబొందల చింపిరి తలల్లోనూ దాచేసి ఆనిశీథంలో చతుర్దశి అమావాస్యని కావిలించుకుంది. కీచురాళ్లు తన కీర్తి గానం చేస్తుంటే, కాలపురుషుని నాలుకలాగా పరుచుకున్న ఆరోడ్డు మీద, చింతలకింద, అమావాస్య కాటుక నూరుతోంది. హఠాత్తుగా చెలరేగిన గాలిదేవుడు తీవ్రంగా కాస్సేపు చెట్లని ఊపి ఊపి, యిట్టే విశ్రమించేసరికి, రోడ్డును కావిలించుకు కూర్చున్న మేఘశకలం కన్నీరు కార్చడం మొదలెట్టింది.

వర్షం పెద్దదవుతుందేమో నని, ఎక్కువ వేగంగా నడుపుకొస్తున్న సుబ్రహ్మణ్యం "జీప్" కారు కళ్ళకి ఒక లారీల వరస కనిపించింది. పూటుగా బియ్యపు బస్తాలతో నిండిన తొమ్మిది లారీలున్నాయి. సుబ్రహ్మణ్యం కారు ఆపి లారీల్ని అటకాయించాడు. తాసిల్దారుగార్ని చూసేసరికి, మాంచి నిషాలో వున్న లారీ డ్రైవర్లకి సైతం గుండె గుభేలుమంది. సుబ్రహ్మణ్యం వల్ల చివాట్లో, జరిమానో పొందని డ్రైవరు ఒక్కడూ లేడు. అసలతన్ని అసహ్యించుకోని వ్యాపారస్థుడుగాని, లారీడ్రైవరుగాని తాలూకా మొత్తం మీద లేనేలేడని చెప్పవచ్చు. తోడి ఉద్యోగస్థులూ, తనకింది గుమాస్తాలూ, ఆఖరికి బంట్రోతులూ సైతం సుబ్రహ్మణ్యం అంటే కంటగిర్రముకొనేవాళ్ళే. ఇంతకు ముందు డిప్యూటీ తాసిల్దార్లుగా పనిచేసి వెళ్ళిన వెంకటరావూ, నారాయణమూర్తీ కుబేరులయి పోయా

రంటే ఆశ్చర్యపడక్కర్లేదు. మరీ కంట్రోలూ, రేషనూ వచ్చింతర్వాత, బిళ్ళబంట్రోతు దగ్గిరనుంచీ రోజుకు అయిదూ ఆరూ కళ్ళ జూసేవాళ్లు. సుబ్రహ్మణ్యం వచ్చిన తరవాత అందరిపొట్టమీదా కొట్టాడు. తను దమ్మిడీ పుచ్చుకోడు. ఇతర్లని పుచ్చుకోనియ్యడు. ఒట్టి అసమర్థుడు కాకపోతే, బాగా ఎదిగిన నలుగురు పిల్లలకీ తాసిల్దారీ అయిన వెంటనే జమ్మన పెళ్ళిళ్లు చేసేవాడు కాదూ!

"పర్మిటు చూపించు" అని సుబ్రహ్మణ్యం అనే సరికి డ్రైవర్లూ, యితర నౌకర్లూ నీళ్ళునమిలి చివరిలారీ ఫ్రంటుసీటులో పడుకున్న అసలు యజమాని రామయ్యకి కబురుచేశారు. సుబ్రహ్మణ్యం పేరు వినే సరికి రామయ్య ప్రాణా లెగిరిపోయాయి. ఒకటి రెండు సార్లు రామయ్య సుబ్రహ్మణ్యానికి వెండి చెప్పు చూపించబోవడం, "అబ్బే! అలాంటివి నా దగ్గర సాగవు..." అని ఖచ్చితంగా సుబ్రహ్మణ్యం చెప్పే సెయ్యడం జరిగింది. పెద్దపెద్ద ఆఫీసర్లతో రామయ్యకి స్వయంగా పరిచయాలూ, ప్రాపకాలూ వుండడంచేత బియ్యం వ్యాపారం దొంగతనంగా ఎంతచేసినా రామయ్యని పట్టుకొనే దమ్ములు ఎవరికీ లేకపోయాయి. అసలారాత్రి కూడా రామయ్య వాకబు బాగానే చేశాడు సుబ్రహ్మణ్యం రాకపోకలవిషయమై. క్యాంపు నుంచి పొద్దూకు వేళకు తిరిగొస్తే ఒచ్చినట్లూ, లేకపోతే మొన్నాడు ఉదయంగాని రాడనీ గుమాస్తాలు చెప్పారు. రాత్రి పదిగంటలదాకా సుబ్రహ్మణ్యం రాకపోయే సరికి రామయ్య అప్పటికప్పుడు లారీలకి బియ్యపు బస్తా లెక్కించి తాను కూడా బయలుదేరాడు.

కాలం కర్మం మూడితే అన్నీ అలాగే ఒస్తాయి. అనుకున్నప్రకారమే క్యాంపునుంచి సుబ్రహ్మణ్యం బయలుదేరాడు. సరిగాఒస్తే చీకటిపడేసరికి పట్నం చేరుకునేవాడే! కాని నడిమధ్యన కారుచెడి రాత్రి పండెండు గంటలదాకా పడివుండాల్సొచ్చింది. తనూ, డ్రైవరూ నానాఅవస్థాపడి బాగుచేసి, మళ్ళా వెనక్కెళ్ళేదేమిటని, ముందుకేసాగారు. దాంతోటే యీ దొంగబియ్యం పట్టుబడ్డాయి.

"అట్టేకాకపోతే, నాలుగునెలలు ఖైదుపడుతుంది మనకిని...అంతా రామయ్యగారే చూసుకుంటాడు" అనే మొండిధైర్యంతో, బీడీలు కాల్చుకుంటూ కూర్చున్నారు డ్రైవర్లంతాను. రామయ్య మటుకు సుబ్రహ్మణ్యాన్ని చివరిలారీ ఫ్రంటుసీటులో కూచోపెట్టి ప్రాధేయపడటం మొదలెట్టాడు. సుబ్రహ్మణ్యం జీపుడ్రైవరూ, బిళ్ల బంట్రోతూ కూడా లారీ డ్రైవర్లతోచేరి సుబ్రహ్మణ్యంఅసమర్థతనీ, కర్కోటకత్వాన్నీ విమర్శించుకుంటున్నారు. "ఇది పెద్ద లాటులే. ఇటోఅటో తేలిపోవాలి." అని తుదినిర్ణయం కోసం నిరీక్షిస్తున్నారు వాళ్లు.

లారీకి వందచొప్పున మొదలెట్టి, వెయ్యివరకూ బేరంపెట్టాడు రామయ్య, సుబ్రహ్మణ్యం ఎంతమాత్రం సందుయివ్వకపోయినా కూడా. "అదికాదు స్వామీ! నా పరువూ, ప్రతిష్ఠా గంగపాలవుతాయి కేసుపెడితే. అందువల్ల మీకుమాత్రం ఏంలాభం?...మీరూ నలుగురు పిల్లలకు పెళ్లిళ్లుచేయాలి...ఊళ్ళో ఏమనుకుంటున్నారో కాస్త గ్రహించండి...వెనక యింతఉన్న వాళ్ళూ కాదయ్యే!... ఈ కాలంలో ఎంతలేదన్నా నాలుగు వేలయితేగాని ఆడపిల్లపెళ్ళి కాదు." అని కాస్త ఆగాడు రామయ్య. సుబ్రహ్మణ్యం ఏమీ సమాధానం చెప్పకపోయేసరికి, మెత్తపడుతాడనే ఉద్దేశంతో... "నలుగురి పెళ్ళిళ్ళకి నాలుగునాలుగులు పదహారువేలూ తీసుకుని నన్ను బయటపడేయండి..." అని కాళ్ళమీద పడ్డాడు. "అసలు తన అంతస్థుకి తను యిలా దీనాలాపాలూ, ప్రార్థనలూ చెయ్యవలసినవాడు కాదు. ఎంత మహామహావాళ్లనయినా, పచ్చనోట్లు పారేసి యిట్టే కట్టేసుకున్నవాడు. ఇప్పుడు ప్రాణం మీదికొచ్చింది. దొంగవ్యాపారంలో లక్షలు గడించినా వేలుపెట్టి చూపించటానికి ఒక్కకేసన్నా లేకుండా జరుపుకుంటూ ఒచ్చాడు యింతకాలమూను. నేటికీ దౌర్భాగ్యుడు తీరా కేసుపెడితే యిక తలెత్తుకు తిరగటాని కాస్కారం వుండదు. ఆనాడు వసుదేవుడు గాడిదకాళ్లు పట్టుకోలేదూ!" అని సమాధానపరుచుకున్నాడు రామయ్య.

సుబ్రహ్మణ్యం తల తిరిగిపోతోంది. ఇంతకాలం తను ఒక్క రాగిదమ్మిడీకాదు కదా, ఆఖరికి

ఒక్క అరటిపండన్నా కూడా పుచ్చుకోలేదు. "లంచాలు పుచ్చుకోడు" అని బాగా పేరు పడిపోయినాక ఎవరూ యివ్వొచ్చేవాళ్లే కాదు. ఇంట్లో ఎంత యిదిగావున్నా తన కాబుద్ధేపుట్టేది కాదు. పాపం, తన పెళ్లాం అప్పుడప్పుడు చూచాయగా అంటూవుండేది... "పిల్లల పెళ్లిళ్లు చెయ్యాలి గదా మరి! నలుగురితో బాటు మీరూను." అంటే, తనింతెత్తులేచి "అయితే లంచపు బతుకు బతకమంటావా?... వెధవ సలహాలు చెప్పావంటే ఒళ్లు చీలుస్తా..." నంటూ, మీద దెబ్బవేసేటంతవరకూ వెళ్లాడోమాటు! అయితేమాత్రం ఏం లాభం? తను లంచగొండి కాదని ఆఫీసర్లందరికీ తెలుసు. కాని ప్రమోషనేదీ మరి? బోలెడన్ని బ్లాక్ మార్కులూ, రిపోర్టులూ వుండి, ఆఖరికి సస్పెన్షనువరకూ వచ్చిన నీలకంఠం డిప్యూటీ కలెక్టరయి కూర్చున్నాడు. తన జూనియర్లెంతమందో యిట్టే తన నెత్తిమీది కెక్కి వచ్చారు. తన నిజాయితీ తనకి తెచ్చిపెట్టిన ఘనత ఏముందీ? నలుగురితో బాటు నడవకుండా వుండటంవల్ల ఆఖరికి బంట్రోతు దగ్గర్నుంచీ తనంటే వెగటే! అవును మరి! పిల్లల పెళ్లిళ్లు ఏనాడో చెయ్యావలసింది. డబ్బులేకేగా నోరుమూసుకుకూర్చుంది? ఒకటే అరా కాదు. పదహారువేలు! జీవితమంతా నౌకరీచేత్త మటుకు నిలవచేసి ఏడుస్తారా యింత మొత్తం! పదహారు కాదు యిరవై యివ్వమన్నా యిస్తాడు రామయ్య... గారు. పిల్లలు నలుగురి కన్యచరా ఒదిలించినవాడవుతాడు. ఇహ సుశీల ఒక్కత్తేగా మిగిలేది?... అది పసి సన్నాసి... ఇప్పుడప్పుడే ఏమీ తొందరలేదు. చచ్చి స్వర్గానవున్న వాళ్ల తల్లీ సంతోషిస్తుంది-పిల్లలంతా ఒకింటివాళ్లయి వాళ్ల కాపరాలు వాళ్లు చేసుకుంటుంటే... "ఫరవా లేదు పుచ్చుకోండి నాన్నగారూ" అని కూతుళ్లూ, "పుచ్చుకోకపోతే పిల్లల పెళ్లిళ్లుకావు..." అని భార్యా అతన్ని తొందరపెడుతున్నట్టనిపించింది. స్వప్నంలోంచి లేచివచ్చినవాడి మాదిరిగా కళ్లారుస్తూ చూసేసరికి, రామయ్య వంద రూపాయలనోట్ల కట్టలు లెక్క పెడుతున్నాడు. "ఇరవై చేసుకోండి" అందామని అనుకుంటుంటే సుబ్రహ్మణ్యం నాలుకని ఎవరో బలవంతాన వెనక్కి లాగినట్టనిపించింది. పెదిమెలు ఒణికాయి. ఒళ్లు ముచ్చెమటలు పోసింది. కళ్లు గిర్రున తిరిగాయి. దూరాన మేఘాలు మూలుగు ధ్వనితో ఏడ్చాయి. వాన బొట్లు సన్నగా పడుతూనే వున్నాయి. ఒక్క మెరుపు మెరిసింది కూడాను.

సుబ్రహ్మణ్యం లేచి నుంచున్నాడు. బియ్యపు గింజ దొరక్క ఆకలిడొక్కలతో అలమటించే అశేషజనం తనముందు దీనాలాపాలతో పడివున్నట్టనిపించింది. దేశంలో ఎక్కడా తలదాచుకుంటానికి చోటులేక, తన హృదయంలో యింతకాలంగా నిశ్చింతతో కాపరంచేస్తున్న ధర్మదేవతలు కన్నీరు కారుస్తూ లేచిపోతున్నారు. ఉద్యోగం యింకా చేసినన్నాళ్లు చెయ్యబోడు. చివరి రోజుల్లో యీ కక్కుర్తిపడి హృదయాన్ని చంపుకోటం మహాఘోరమనిపించింది. నారు పోసినవాడు నీరు పొయ్యకపోడు.

పాపం! రామయ్య లెక్కపూర్తిచేసి లేస్తున్నాడు. కేసు పెడితే అతని కిక తలెత్తుకు తిరిగే ఆశవుండదు. పోనీ, కేసు పెట్టనే పెట్టడు తను. కాని డబ్బు మాత్రం ముట్టుకోరాదు......

రామయ్య లేచి "చిత్తం... స్వీకరించండి. అంత పైకం యిక్కడలేదు. నేనేం కలగన్నానా తేవటానికి?... రేపు రాత్రి తమ దర్శనం చేస్తా... ఉన్నంత వరకు పట్టుకు పొండి..." అంటూ నోట్ల కట్ట అందియ్యబోయాడు. సుబ్రహ్మణ్యం మందహాసం చేస్తూ "క్షమించండి... నేను తీసుకోను..." అంటూ "కాసిం!" అని తన డ్రైవర్ని పిలిచాడు.

రామయ్యకు గంగవెర్రులెత్తాయి. ఏం చెయ్యటానికీ తోచలేదు. సుబ్రహ్మణ్యం జీప్‌లో ఎక్కబోతున్నాడు. క్షణాలమీద కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలి. ఒక్క గడియలో తన పేరూ, ప్రతిష్ఠా, సర్వమూ దగ్ధపటలం అయిపోతాయి. ఒక్క నిట్టూర్పువిడిచి చుట్టూ చూశాడు. తొమ్మిదిమంది డ్రైవర్లూ, తొమ్మిదిమంది క్లీనర్లూ, పద్దెనిమిదిమంది కూలీలూ కనిపించారు. చరచరా జీపుముందరికెళ్లి "తాసిల్దారుగారూ! మీ ప్రాణాలు దక్కవు... పదహారు కాకపోతే యిరవై తీసుకోండి... తప్పితే..." అన్నాడు రామయ్య. సుబ్ర

హ్మణ్యం హృదయంలోని దేవతలు చర్రున లేచారు "మీ ప్రాణాలు దక్కవు" అనేమాట వినేసరికి. అతను నిర్లక్ష్యంగా నవ్వి "పోనియ్యవోయి! కాసిం..." అన్నాడు డ్రైవరుతో.

రామయ్య కిక ఆలోచించటానికి టైములేదు. మరుక్షణంలోనే రామయ్య చేతిలోని దుడ్డుకర్ర సుబ్రహ్మణ్యం నెత్తిన పడింది. ఆయువుపట్టులో తగిలిందో ఏమో సుబ్రహ్మణ్యం వెంటనే నేలకొరిగాడు. గల్లంతుగా మూగిన డ్రైవర్లకూ, కూలీలకూ సంగతి బోధపడింది. కాసింకూ, తాసిల్దారుగారి బంట్రోతుకూ చెరో వెయ్యిరూపాయలకట్టా అప్పుడే పడేశాడు రామయ్య.

3

తెల్లారేటప్పటికి ఊరంతా గప్పుమంది, ధర్మరాజులాంటి సుబ్రహ్మణ్యంగారిని దొంగలు కొట్టి చంపారని. కాసిముకీ, తాసీల్దారు గారి బంట్రోతుకీ దెబ్బలయితే తగిలాయికాని అదృష్టవశాత్తూ చావలేదు.

"మంచివాళ్లకి కాలంకాదు." అని ముసలాళ్లనుకున్నారు. "పీడ విరగడైపోయిం" దని తోడి ఉద్యోగులు సంతోషించారు. "బతికాంరా బాబూ! నాలుగు డబ్బు లేరుకోవచ్చు"నని ఆఫీసు బంట్రోతులు లోలోపల ఆనందించారు.

పౌరులు ఒక సానుభూతిసభ ఏర్పాటు చేశారు ఆ సాయంత్రం. "ఉద్యోగస్థులలో లంచం తినని వాళ్లుంటారంటే నమ్మటం అసంభవమనీ, కాని సుబ్రహ్మణ్యంగారు ఎర్రని యాగానీకూడా ముట్టుకోకుండా ఉద్యోగధర్మాన్ని చక్కగా నిర్వర్తించాడనీ, అలాంటి సత్పురుషుడికిలాంటి దుర్మరణం ప్రాప్తించడం విధివైపరీత్యమేననీ చాలామంది ఉపన్యాసాలు చెప్పారు.

సభాంతాన అధ్యక్షులు రామయ్యగారు అశ్రుపూరితనయనాలతో "సుబ్రహ్మణ్యంగారి ఆత్మకు శాంతి కలుగుగాక!" అని భగవంతుని ప్రార్థించటానికి అందరినీ ఒక్కమాటు లేచినుంచోమన్నారు.